
www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY



తెలంగాణ దిక్సూచి

మంగళవారం | 10 | నవంబర్ | 2026 | పేజీలు: 08

లోకేశ్వరం ప్రగతికి
భారీగా నిధులు!

పంచాయతీ అంగన్వాడీ భవనాల నిర్మాణానికి పెద్దపీట

ఫెడరేషన్ భవనాలు, వర్క్‌షెడ్లకూ నిధుల కేటాయింపు

గ్రామాల అభివృద్ధికి నిధుల వరద

మౌలిక వసతుల కల్పనకు భారీ ప్రోత్సాహం!

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



లోకేశ్వరం, అక్షిత న్యూస్ : నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసినట్లు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, వెల్లడించారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేసే దిశగా గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనాలతో పాటు ఫెడరేషన్ భవనాలు, వర్క్‌షెడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. బామ్నీ (కె) గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ..మిగతా 2లో

ఫిర్యాదులు
పెండింగ్‌లో పెట్టొద్దు

కలెక్టర్ చంద్రశేఖర్



నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ : వచ్చేవారం నాటికి పెండింగ్ లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులలో 75 శాతం ఫిర్యాదులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో ప్రజావాణి ఫిర్యాదులపై సమీక్షించారు.ఇప్పటివరకు జిల్లాలో ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు 301 పెండింగ్ లో ఉన్నాయని, వీటిలో వచ్చే వారం నాటికి 200 లు పరిష్కరించాలని, తదుపరి వచ్చే వారానికి మరో 100 పరిష్కరించేలా జిల్లా అధికారులందరూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 30 రోజులకు మించి 149 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, జిల్లా అధికారులు సంబంధిత సెక్షన్ల సూపరింటెండెంట్‌లతో ..మిగతా 2లో



కొడంగల్‌కు రైతు దండు

రైతు మేళాకు కదిలిన రైతులు

రైతుల సంక్షేమమే లక్ష్యం

లింగంపల్లి బస్సులను జెండా ఊపి ప్రారంభం

మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్, అక్షిత ప్రతినిధి : కొడంగల్ కు రైతు దండు కదిలింది. రైతు మేళాకు ఊరు వాడా చేరింది.రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని చాటిచెప్పేలా కొడంగల్‌లో ఈరోజు సాయంత్రం నిర్వహిస్తున్న మెగా రైతు మేళాకు మక్తల్ నియోజకవర్గం నుంచి రైతులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన ..మిగతా 2లో

ప్రగతి పతాకగా కరీంనగర్

కరీంనగర్ నగరంలో పర్యటించిన మంత్రులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కరీంనగర్, అక్షిత బ్యూరో : కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నగరంలో పర్యటించారు. నగర ప్రథమ పౌరులు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య ..మిగతా 2లో

క్రీడలతో మానసిక ఉల్లాసం

భద్రాచలం ఫుట్‌బాల్ క్లబ్

టోర్నమెంట్ విజేతగా భద్రాచలం జట్టు

విజేతలు, రన్నరప్, తృతీయ స్థానంలో నిలిచిన జట్లకు కప్‌లు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



భద్రాచలం, అక్షిత న్యూస్: భద్రాచలం ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో భద్రాచలం ఐటీడీఏ రోడ్డులోని జూనియర్ ..మిగతా 2లో

లోకేశ్వరం ప్రగతికి భారీగా నిధులు!

మొదటి పేజీ తరువాయి...

రూ.20 లక్షలు మంజూరయ్యాయి. గ్రామస్థులకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు నూతన భవనం ఉపయోగపడనుంది.

8 గ్రామాల్లో అంగన్వాడీ భవనాలు

మండలంలోని థర్మోరా, జోహార్‌పూర్, లోకేశ్వరం, మన్మథ్, పంచగుడి, పుష్పూర్, రాజురా, వటోలి గ్రామాల్లో అంగన్వాడీ భవనాల నిర్మాణానికి ఒక్కో దానికి రూ.12 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు ఈ భవనాలు దోహదపడనున్నాయి.

రాజేష్ బాబు తండాకు రూ.20 లక్షలు

రాజేష్ బాబు తండాలో ఫెడరేషన్ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, వర్క్‌షెడ్ నిర్మాణానికి మరో రూ.10 లక్షలు మంజూరయ్యాయి. గ్రామీణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఈ నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడితేనే గ్రామాలు ప్రగతి పథంలో ముందుకు సాగుతాయని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్,పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన వసతులు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మొదటి పేజీ తరువాయి...

కళాశాల మైదానంలో నిర్వహించిన 7 ఏ సైడు ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారం ఉత్సాహభరితంగా ముగిసింది.ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో భద్రాచలం జట్టు విజేతగా నిలవగా, డోర్నకల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. అదేవిధంగా మూడవ స్థానంలో భద్రాచలం సిఆర్ పిఎఫ్ జట్టు నిలిచింది. విజేత, రన్నరప్, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా కప్‌లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే తత్వం, పరస్పర స్నేహభావం, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి జన్మదినం రోజున ఈ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్స్ జరగడం ఎంతో సంతోషకరమైన విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి గారికి ఫుట్‌బాల్ అంటే ఎంతో ఇష్టమని, గతంలో ఆయన కూడా ఫుట్‌బాల్ ఆడిన సందర్భాలను మనం చూశామని గుర్తు చేశారు.

ప్రగతి పతాకగా కరీంనగర్

మొదటి పేజీ తరువాయి...

గ్రంథాలయం చైర్మన్ సత్తు మల్లేశంతో కలిసి నగరంలోని 23 వ 25 వ, 26 వ, 46 వ డివిజన్లలో మొత్తం రూ. 4.50 కోట్ల నిధులతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నగరంలోని 46 వ డివిజన్ రాంనగర్ లో స్థానిక కార్పోరేటర్ మల్లిఖార్జున్ రాజేంధర్ తో కలిసి యూఐడిఎఫ్ కు చెందిన 1.50 కోట్ల అంచనాతో బాక్స్ డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభం చేశారు. అనంతరం 25, 26వ డివిజన్ల పరిధిలో స్థానిక కార్పోరేటర్లు వైద్యుల అంజన్ కుమార్, గంట శ్రీనివాస్ తో కలిసి సుభాష్ నగర్ లోని బుట్టి రాజారామ్ కాలనీ, ముదిరాజ్ కాలనీ, సుభాష్ నగర్ బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో యూఐడిఎఫ్ కు చెందిన రూ. 2 కోట్లతో పైపు లైన్ డ్రైనేజీ లు, సీసీ రోడ్ల నిర్మాణం కోసం భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం 23 వ డివిజన్ సీతారాంపూర్ రెడ్డి హాస్టల్ సమీపంలో స్థానిక కార్పోరేటర్ గుమ్మడి రాజ్ కుమార్ తో కలిసి యూఐడిఎఫ్, ఎంజీఎఫ్ కు చెందిన రూ. 1 కోటి నిధులతో మురికి కాలువ పైపు లైన్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులు, అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి నగర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా జిల్లా, నగర అభివృద్ధి కోసం సమిష్టిగా పని చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కరీంనగర్ ను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. నగరంలో పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా అర్బన్ డెవలప్మెంట్ కు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.



కొడంగల్‌కు రైతు దండు



మొదటి పేజీ తరువాయి...

రైతుల బస్సులను లింగంపల్లి గ్రామం నుంచి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి రైతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని పేర్కొన్నారు. రైతులకు అండగా నిలవడం, వారి కష్టాలను తగ్గించడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం ప్రభుత్వ లక్ష్యమని



తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు సాగుకు అవసరమైన వసతులు, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని భావిస్తున్న ప్రజా ప్రభుత్వం....రైతుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మెగా రైతు మేళా ద్వారా రైతులకు వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన మార్పులు, ఆధునిక సాగు విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కలుగుతుందని తెలిపారు.

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా మక్తల్ నియోజకవర్గం నుంచి రైతులు పెద్దఎత్తున తరలిరావడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో పెట్టొద్దు

మొదటి పేజీ తరువాయి...

ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేకంగా సమీక్షించి వాటిని పరిష్కరించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గతంలో నిర్దేశించినట్లే మండల ప్రత్యేక అధికారులు

వసతి గృహాలను తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని, ఈ నెలలో టాయిలెట్లు, భోజనం నాణ్యత, హాస్టల్ వాతావరణంపై దృష్టి సారించాలని చెప్పారు.

పాఠశాల విద్యార్థులందరికీ ఈనెలాఖరులోగా ఆధార్ కార్డుల జారీ కార్యక్రమం పూర్తి చేయాలని, అలాగే మధ్యలో బడి మానేసిన పిల్లలందరిని తిరిగి పాఠశాలల్లో చేర్పించే పనిని పూర్తి చేయాలన్నారు.

ఎల్ నినో ను దృష్టిలో ఉంచుకొని తాగునీటికి ఇబ్బందులు లేకుండా పైపులైన్లు, చిన్న ,చిన్న మరమ్మతుల నిర్వహణ చేపట్టాలని, ప్రజలకు తాగునీటి ప్రాధాన్యత, వాన నీటి సంరక్షణ పై అవగాహన కల్పించాలని చెప్పారు.

వి బి జి రాంజీ కింద మంజూరు చేసిన పనులన్నింటినీ గ్రౌండ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా



ప్రారంభించిన చేయూత పెన్షన్ల లో భాగంగా నియమ, నిబంధనల ప్రకారం జిల్లాలో పంపిణీ చేయాలని, ఎట్టి పరిస్థితులలో అనర్హులకు పెన్షన్లు ఇవ్వరాదని అన్నారు.

ఈనెల 12న జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాతోతు హుస్సేన్ జిల్లా సందర్శన సందర్భంగా జిల్లా అధికారులందరూ వారి శాఖలకు సంబంధించి షెడ్యూల్ తెగల వారికి అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన నివేదికలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ప్రతినెలా 5లోగా ఆ నెలలో జిల్లా అధికారులు చేసే పర్యటనల డైరీ సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.వార్తా పత్రికలలో ప్రచురితమయ్యే వ్యతిరేక వార్తలకు స్పందించి వెంటనే వివరణ సమర్పించాలని, అలాగే తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

ప్రజావాణి కార్యక్రమానికి గైరహాజరైన అధికారులకు షోకాజ్ నోటీసు జారీ చేయాల్సిందిగా కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్ ను ఆదేశించారు.కాగా ఈ సోమవారం మొత్తం (85) మంది ఫిర్యాదుదారులు వారి దరఖాస్తులను సమర్పించగా, రెవిన్యూ శాఖకు(39),ఇతర శాఖలకు (46) ఫిర్యాదులు వచ్చాయి. శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, డిఆర్ఓ దశరథ్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

ప్రజల సమస్యల పరిష్కారమే నిర్మల్ పోలీసుల లక్ష్యం!

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ డా.జి.జానకి షర్మిల...

బాధితులకు సత్వర న్యాయం అందించాలి.. ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు



నిర్మల్, అక్షిత ప్రతినిధి, నవంబర్ 9 : ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, తెలిపారు.బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల ప్రధాన బాధ్యతని,ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే స్పందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ప్రజలతో నేరుగా.. సమస్యలపై ఆరా

నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వయంగా స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజలు తమ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి భరోసా కల్పించాలని, వారి మాటలను ఓపికగా విని సమస్యను అర్థం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకొని చట్టపరిధిలో పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందించి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకువచ్చే అవకాశం



ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఫిర్యాదుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు.

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా వ్యవహరించాలని, వారికి అవసరమైన సహకారం అందించాలని పేర్కొన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు బాధితులకు అండగా నిలవడం పోలీస్ శాఖ ప్రధాన కర్తవ్యమని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో నిర్మల్ పోలీస్

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహించాలని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడమే నిర్మల్ పోలీసుల లక్ష్యమని స్పష్టం చేశారు...

బాధితుల ప్రతి సమస్య పట్ల.. జవాబుదారీతనంతో ఉండాలి

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



అదిలాబాద్, ఇచ్చోడ అక్షిత న్యూస్ : సమస్యలను చెప్పుకునేందుకు పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల పట్ల జవాబుదారీతనంతో ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బాధితుల సమస్యలు పరిష్కారమైనప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందనీ ఆయన పేర్కొన్నారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 18 ఫిర్యాదులను ఎస్పీ నేరుగా స్వీకరించారు. సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉందన్నారు. పోలీసుల ద్వారా పరిష్కరించదగిన సమస్యలపై బాధితులు నిర్భయం గా జిల్లా పోలీసు కార్యాలయాన్ని, నేరుగా జిల్లా ఎస్పీ ని సంప్రదించాలని ఆయన సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న ట్లు సమాచారం ఉంటే జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 8712659973 వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు లేని, గంజాయి మరియు మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను నిర్మించేందుకు యువత, ప్రజలు పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, సిబ్బంది వామన్, సునీల్, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణపై కరాటే శిక్షణ

రాణి లక్ష్మీబాయి స్వీయ రక్షణ కార్యక్రమంలో భాగంగా తరగతుల ప్రారంభం



అక్షిత ప్రతినిధి భూపాలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతోపాటు స్వీయ రక్షణ నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాణి లక్ష్మీబాయి స్వీయ ఆత్మరక్షణ కార్యక్రమం కింద మూడు నెలలపాటు కరాటే శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ప్రసన్న రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మాస్టర్ గోసిక అశోక్ ఆధ్వర్యంలో మూడు నెలలపాటు శిక్షణ కొనసాగనుంది. వారానికి మూడు తరగతుల చొప్పున నెలకు 12 తరగతులు నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా మాస్టర్ అశోక్ మాట్లాడుతూ.. విద్యార్థినులకు కరాటే, కిక్ బాక్సింగ్, కర్రసాము తదితర విద్యల్లో శిక్షణ అందించి, ఆపద సమయంలో తమను తాము రక్షించుకునేలా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు రాజయ్య, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

ఇంద్రపాలనగరంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడి మృతి, కుటుంబానికి సర్పంచ్ విక్రమ్ పరామర్శ..



రామన్నపేట, అక్షిత ప్రతినిధి: ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొల్కెపెల్లి రాములు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసీ రాష్ట్ర కార్యదర్శి, గ్రామ సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ పరామర్శించారు. ఈ సందర్భంగా రాములు మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5,000 (ఐదు వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఏ ఆపద వచ్చినా తన వంతు సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకే రైతు గర్జన!

ఈ నెల 11న నిర్మల్‌లో రైతు గర్జన సభ.. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ బీసీ సంఘం నాయకుడు సుంకేట పోశెట్టి పిలుపు...



నిర్మల్,అక్షిత ప్రతినిధి నవంబర్ 9 : నిర్మల్ జిల్లా లోని యూరియా కొరత, విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల పక్షాన గొంతెత్తి, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ నెల 11న నిర్వహించనున్న రైతు గర్జన సభను విజయవంతం చేయాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) బీసీ సంఘం నాయకుడు సుంకేట పోశెట్టి పిలుపునిచ్చారు.

ఈ నెల 11న సాయంత్రం 4 గంటలకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ గ్రౌండ్‌లో రైతు గర్జన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు.

యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు, విద్యుత్ కోతలతో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రైతుల హక్కుల కోసం పోరాడేందుకు ఈ సభ నిర్వహిస్తున్నట్లు పోశెట్టి తెలిపారు. జిల్లాలోని రైతు సోదరులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రముఖ నేతల హాజరు

రైతు గర్జన సభకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యామ్ సుందర్, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకృష్ణ రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొననున్నట్లు సుంకేట పోశెట్టి తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ సభకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు...

అరెస్టులతో వికలాంగుల ఉద్యమాలను అణచలేరు

బివిహెచ్ పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గిద్ది రాజేష్



చిలుకూరు నవంబర్ 09(అక్షిత న్యూస్): సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటన నేపథ్యంలో వికలాంగుల హక్కుల కోసం పోరాడుతున్న బివిహెచ్ పిఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గిద్ది రాజేష్‌ను పోలీసులు ఆదివారం అర్ధరాత్రి నిర్బంధించి చిలుకూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గిద్ది రాజేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరడం నేరమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.వికలాంగుల నెలవారీ పింఛన్‌ను రూ.6,000కు పెంచాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారికి నూతన పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతి జిల్లాలో కనీసం 5,000 బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అర్ధరాత్రి అరెస్టులు, పోలీసుల నిర్బంధాలతో వికలాంగుల హక్కుల ఉద్యమాలను అణచివేయలేరని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ బెదిరింపులకు, పోలీసు నిర్బంధాలకు భయపడేది లేదని, వికలాంగుల హక్కుల సాధన కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని, కొడంగల్ నుంచే వికలాంగుల ఉద్యమ సత్తా ఏమిటో ప్రభుత్వానికి చూపిస్తామని హెచ్చరించారు.ఈ నిర్బంధంలో చిలుకూరు మండల అధ్యక్షుడు కట్టెకోల ఎల్లయ్య గౌడ్, జిల్లా సీనియర్ నాయకుడు తమ్మన బోయిన చిన్న వీరయ్య, జిల్లా నాయకుడు తమరుష పవన్ కుమార్, ఆచార్యులు, మండల నాయకుడు కీత సీతయ్య తదితరులు ఉన్నారు. అరెస్టయిన నాయకులకు సూర్యాపేట జిల్లా స్పేరో ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి శివకృష్ణ మద్దతు తెలిపారు.

లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరుపై యువత ఆరా!



నాగర్‌కర్నూలు, అక్షిత ప్రతినిధి: లింగాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది హాజరు, విధుల నిర్వహణ, సమయపాలన, అందుబాటులో ఉన్న సిబ్బంది సంఖ్య తదితర అంశాలపై వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు సోమవారం గ్రామ ఉపసర్పంచ్ నాయకపు వీరాస్వామి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కొంతమంది యువకులతో కలిసి ఆసుపత్రిని సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా ఆసుపత్రిలో సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా? నిర్ణీత సమయాల్లో విధులు నిర్వహిస్తున్నారా? ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా? అనే అంశాలపై వివరాలు తెలుసుకునేందుకు విచారణ చేపట్టడం జరిగింది.అయితే ఆసుపత్రి సూపరింటెండెంట్ అందుబాటులో లేకపోవడంతో, ఆయన అందుబాటులో ఉంటారని సిబ్బంది తెలియజేశారు. దీంతో సూపరింటెండెంట్ ని కలిసి ఆసుపత్రి పనితీరు, సిబ్బంది విధులు మరియు ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించాలని నిర్ణయించడం జరిగింది.కావున లింగాల గ్రామ ప్రజలు, యువకులు రేపు జరగబోయే సూపరింటెండెంట్ గారితో సమావేశంలో పాల్గొని మన గ్రామ ఆసుపత్రి అభివృద్ధికి, మెరుగైన వైద్య సేవల అందుబాటుకు తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరుతున్నాము.ప్రజా సమస్యలపై స్పందిస్తూ, గ్రామ అభివృద్ధి కోసం ముందుండి పోరాడుతున్న ఉపసర్పంచ్ నాయకపు వీరాస్వామికి, అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ యువకులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.

"హలో యువత.. ఎటువైపు నీ భవిత!"

మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు

ఉద్యోగ, ఉపాధి మార్గాల వైపు యువత పయనించాలి

యువతకు ది మిషన్ ఫౌండర్, ఎక్సైజ్ సీఐ కొట్టే ఏడుకొండలు పిలుపు



రామన్నపేట,అక్షిత ప్రతినిధి : డ్రగ్స్, గంజాయి, మద్యం, బెట్టింగ్ వంటి వ్యసనాలకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉద్యోగ, ఉపాధి అవకాశాల వైపు దృష్టి సారించి సన్మార్గంలో పయనించాలని ది మిషన్ ఫౌండర్, ఎక్సైజ్ సీఐ కొట్టే ఏడుకొండలు యువతకు పిలుపునిచ్చారు. మునిపంపుల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రామన్నపేట పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ వారి సహకారంతో "హలో యువత.. ఎటువైపు నీ భవిత!" అనే నినాదంతో గ్రామ యువతకు డ్రగ్స్, గంజాయి, మద్యం, బెట్టింగ్ తదితర వ్యసనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొట్టే ఏడుకొండలు మాట్లాడుతూ యువత దేశానికి,సమాజానికి భవిష్యత్తు ఆశాకిరణాలని, అలాంటి యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను అంధకారం చేసుకోవడం బాధాకరమన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబాలను, సామాజిక సంబంధాలను విచ్ఛిన్నం చేస్తుందని హెచ్చరించారు. రామన్నపేట ఎస్.ఐ గోపతి సతీష్ మాట్లాడుతూ బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం వంటి వ్యసనాలకు అలవాటుపడి యువత ఆర్థికంగా నష్టపోవడంతో పాటు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలను, కుటుంబ సభ్యుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా యువత తమ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, ఉద్యోగం, ఉపాధి, క్రీడలు, సామాజిక సేవ వంటి నిర్మాణాత్మక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగం గురించి తెలిసినప్పుడు పోలీస్, ఎక్సైజ్ శాఖల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ గ్రామ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలనే ఉద్దేశంతోనే గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. యువత భవిష్యత్తును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని, మునిపంపుల గ్రామాన్ని మత్తు పదార్థాలు, బెట్టింగ్, ఇతర వ్యసనాలకు దూరంగా ఉన్న ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై అరుణ్ కుమార్, గ్రామ ఉప సర్పంచ్ తాళ్ల క్రాంతి కుమార్, విఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ రాంరెడ్డి, సామాజిక కార్యకర్త నీలం శేఖర్, ఉపాధ్యాయులు కుక్కడపు రమేష్, పాలకవర్గం సభ్యులు యాదాసు లక్ష్మణ్,మేకల రాములు,కునూరు లక్ష్మమ్మ,గంటెపాక శ్రీను, మేకల జలేందర్ మాజీ యంపిటిసి గాదె పారిజాత,గంటెపాక శివ కుమార్,వేముల సైదులు, బూరుగు గోపి కృష్ణ, తోలుపునూరి చంద్రశేఖర్,జితేందర్,ఉడుతల శ్రీనివాస్,ఏలూరి అనిత,బాదే మంజుల,యాదాసు శోభ, బూడిద మారయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశం



వరంగల్, అక్షిత బ్యూరో: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ప్రాధాన్యత క్రమంలో సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 56 దరఖాస్తులు అందగా, అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 22, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 8, డీఆర్డీఏకు 4, గృహ నిర్మాణ శాఖకు 3, ఎంజీఎంకు 3 దరఖాస్తులు రాగా వివిధ శాఖలకు బంధించిన 16 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిని ఆశ్రయిస్తున్నందున అధికారులు ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ ప్రజావాణి అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్ డియార్వో విజయలక్ష్మి జడ్పీ సీఈఓ వసంత సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాద బాధిత కుటుంబానికి చిలుకూరు ప్రెస్ క్లబ్ చేయూత

మానవత్వమే ప్రధాన లక్ష్యంగా సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రెస్ క్లబ్ ప్రాధాన్యం



చిలుకూరు, నవంబర్ 09,(అక్షిత న్యూస్): ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ సమాజ సేవలో జర్నలిస్టులు ముందుండాలని చిలుకూరు మండల ప్రెస్ క్లబ్ నిరూపించింది. బైక్ ప్రమాదంలో గాయపడి గత రెండు నెలలుగా పనికి వెళ్లలేక జీవనోపాధికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిలుకూరు మండలానికి చెందిన బైక్ మెకానిక్ మొగల్ నయీంపాషా కుటుంబానికి ప్రెస్ క్లబ్ సభ్యులు చేయూత అందించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు షేక్ మీరాసాహెబ్ చొరవతో నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను కుటుంబ సభ్యులకు అందజేశారు.ప్రమాదం కారణంగా వృత్తికి దూరమై కుటుంబ పోషణ భారంగా మారిన నయీంపాషా పరిస్థితిని గుర్తించిన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు షేక్ మీరాసాహెబ్ తోటి జర్నలిస్టులతో చర్చించి సహాయం అందించేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు ప్రెస్ క్లబ్ సభ్యుల సహకారంతో నిత్యావసర సరుకులను సమకూర్చి బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు షేక్ మీరాసాహెబ్ మాట్లాడుతూ జర్నలిస్టులు కేవలం వార్తల సేకరణ, ప్రచురణకే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న సమస్యలను గుర్తించి, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సహాయం అందేవిధంగా చూస్తామని తెలిపారు. సమాజంలో సేవాభావం, మానవత్వం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పేర్కొన్నారు.ఆపద సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచి నిత్యావసర సరుకులు అందించిన చిలుకూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సభ్యులకు మొగల్ నయీంపాషా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు షేక్ మీరాసాహెబ్ ((ప్రజావాణి), నూకపంగు వీరబాబు (నినాదం), కందుకూరి వంశీకృష్ణ (జనం సాక్షి), అమరగాని కృష్ణ గౌడ్ (మీడియా టుడే), గవిని ఆంజనేయులు (మన దీపం), బొలిశెట్టి నాగేంద్రబాబు (అక్షిత న్యూస్), కందుకూరి కృష్ణమూర్తి (విజన్ ఆంధ్ర), లక్ష్మణ్ (నమస్తే తెలంగాణ), ఐనుద్దీన్ (జనం న్యూస్), న్యాయవాది కన్నం సాహెబ్, బీఆర్ఎస్ నాయకులు షేక్ పాషా, మసీదు కమిటీ అధ్యక్షులు యూసఫ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY

పరిశుభ్రతకు దూరం... మానవత్వానికి మచ్చ...!

టిఫిన్ సెంటర్‌లో మైనర్లతో పనులు
అధికారుల పర్యవేక్షణ ఏది.. ?



కరీంనగర్ అక్షిత బ్యూరో: ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించాల్సిన టిఫిన్ సెంటర్లలోనే అపరిశుభ్రత రాజ్యమేలుతుంటే... సామాన్య ప్రజల ఆరోగ్యానికి రక్షణ ఎక్కడ? చిన్నారుల చేతుల్లో పనులు చేయిస్తూ వారి బాల్యాన్ని శ్రమకు బలి చేస్తుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారు? ఈ ప్రశ్నలు ఇప్పుడు కరీంనగర్‌లో ఒకింత చర్చ జరుగుతున్న సందర్భాలు ఉన్నాయి. కరీంనగర్ పట్టణం లో వందలాది టిఫిన్ సెంటర్ల తో పాటు చిన్న చిన్న భోజనం లభించే హోటళ్లు సైతం కోకొల్లలు గా ఉన్నాయి. ఇదిలా ఉంటే ప్రభుత్వ సముదాయాలు ఉన్న కొన్ని చోట్ల పుట్ పాతుల ను సైతం ఆక్రమించి పాదాచరులు నడవకుండా వారి వ్యాపార బోర్డు లు పెట్టారు.జిల్లా సమీకృత కార్యాలయం సమీపంలో ఒక రెండు మూడు హోటళ్ళు పుట్ పాతులను అనుకోని టి కాయడం చేస్తున్నారు. ఇదిలా ఉంటే జిల్లా సమీకృత సముదాయం వెనుక గేటుకు ఎదురుగా ఉన్న ఒక టిఫిన్ సెంటర్ పలువురు వినియోగదారులు, స్థానికులు తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణలు కేవలం ఒక దుకాణం స్థాయి సమస్యగా మిగిలిపోకుండా సామాజిక, ఆరోగ్య, నైతిక సమస్యగా మారుతున్నాయి.

ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు జనసంచారంతో కిటకిటలాడే ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, విద్యార్థులు, సాధారణ పౌరులు టీ, కాఫీ, టిఫిన్ల కోసం ఈ సెంటర్‌ను ఆశ్రయిస్తున్నారు. రోజువారీ జీవితంలో భాగమైన ఈ చిన్న ఆహార కేంద్రం ఇప్పుడు అనేక ప్రశ్నలకు కేంద్రంగా మారింది.

"అపరిశుభ్రత రాజ్యమేలుతోంది" ఆరోగ్యం ప్రమాదంలో వినియోగదారులు చెబుతున్నది ప్రకారం ఇక్కడ పరిశుభ్రత పూర్తిగా లోపించింది. తాగునీటి వద్ద కూడా కనీస శుభ్రత పాటించడం లేదు. ప్లేట్లు, గ్లాసులు, స్పూన్లు శుభ్రం చేసే విధానం, వంట ప్రాంతం పరిశుభ్రత, చెత్త నిర్వహణ వంటి అంశాలపై తీవ్రమైన ఫిర్యాదులు వస్తున్నాయి. ఆహారం తయారీ ప్రాంతంలో అపరిశుభ్రత ఉంటే... అది కేవలం ఒక సెంటర్ సమస్య కాదు. రోజువారీ ఆహారం తీసుకునే వందలాది మంది ప్రజల ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. జలవ్యాధులు, ఆహార విషప్రయోగం వంటి ప్రమాదాలు ఎప్పుడైనా తలెత్తే అవకాశం ఉంది. ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో ఉన్న ఇలాంటి స్థలంలో ఇలా జరగడం... అధికారుల నిర్లక్ష్యాన్ని మరింత స్పష్టం చేస్తోంది.

బాల్యాన్ని బలి చేస్తున్నారా? మైనర్లతో పనులు

మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే... ఈ టిఫిన్ సెంటర్‌లో మైనర్లతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు. చిన్నారుల చేత శ్రమ చేయించడం వారి విద్య, ఆరోగ్యం, మానసిక వికాసం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. బాల్యం చదువుకోవడానికి, ఆడుకోవడానికి, స్నేహితులతో కాలం గడపడానికి, ఎదగడానికి... పనిభారంతో నలిగిపోవడానికి కాదు. చిన్న చేతుల్లో ప్లేట్లు కడగడం, గ్లాసులు శుభ్రం చేయడం, టీ-కాఫీ సర్వ్ చేయడం, శుభ్రం చేయడం వంటి పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది కేవలం ఒక యాజమాన్యం తప్పు కాదు. సమాజం మొత్తం మీద ప్రశ్న. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో... ప్రభుత్వ కార్యాలయాలకు అతి సమీపంలోనే ఇలాంటి పరిస్థితులు కొనసాగుతుంటే... అధికారుల పర్యవేక్షణ ఎక్కడ ఉందనే ప్రశ్న తలెత్తుతోంది. చిన్నారుల భవిష్యత్తును వ్యాపార లాభాలకు బలి ఇవ్వడం మానవత్వానికి మచ్చ.

"ఫుట్‌పాత్ ఆక్రమణ పాదచారుల బాధ" ప్రమాదాలు

టిఫిన్ సెంటర్ ఫుట్‌పాత్‌ను ఆక్రమించి సైన్ బోర్డులు, ఇతర వస్తువులు ఏర్పాటు చేశారనే విమర్శలు కూడా ఉన్నాయి. ప్రజలు సౌకర్యవంతంగా నడవాల్సిన ఫుట్‌పాత్‌లు వ్యాపార అవసరాలకు వినియోగిస్తే... పాదచారులు రోడ్డుపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రద్దీ ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో ఇలా జరగడం ప్రమాదకరం. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు రోడ్డుపై నడవాల్సి వస్తే... ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. అయినా సంబంధిత శాఖల పర్యవేక్షణ కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఫుట్‌పాత్ అనేది ప్రజల హక్కు. దానిని వ్యాపారం కోసం ఆక్రమించడం చట్టవిరుద్ధం మాత్రమే కాదు... సామాజిక బాధ్యతను కూడా ఉల్లంఘించడమే.

వినియోగదారుల పట్ల దురుసు వ్యవహారం

కొందరి వినియోగదారులు చెబుతున్నది ప్రకారం... సిబ్బంది కొందరి పట్ల దురుసుగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. సేవా రంగంలో ఉన్న వారు వినియోగదారులను గౌరవించాల్సిన బాధ్యత ఉంది. కానీ ఇక్కడ ఆ బాధ్యత నెరవేరడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఇది కేవలం ఒక సెంటర్ ఇమేజ్‌ను దెబ్బతీయడమే కాకుండ ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది.

"అధికారులు స్పందించాలి " ప్రజలకు భరోసా కల్పించాలి

ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆహార భద్రతా అధికారులు టిఫిన్ సెంటర్‌లో పరిశుభ్రత, తాగునీటి నాణ్యత, ఆహార నాణ్యత, వంట ప్రాంతం పరిశుభ్రతపై తక్షణ తనిఖీలు చేపట్టాలి. కార్మిక శాఖ అధికారులు మైనర్లతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరపాలి. అవసరమైతే చైల్డ్ లేబర్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి. మున్సిపల్ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే సైన్ బోర్డులు, ఆక్రమణలను తొలగించాలి.వ్యాపారం కేవలం లాభాల కోసం మాత్రమే కాదు. ప్రజల ఆరోగ్యం, చిన్నారుల భవిష్యత్తు, సామాజిక బాధ్యత కూడా అంతే ముఖ్యం. ఒక కప్పు టీ అందించే చేతుల్లో బాల్యం బందీ కాకూడదు. ప్రజలు తినే ఆహారంలో అపరిశుభ్రత కలవకూడదు . ఫుట్‌పాత్‌లు ప్రజల నడకకు ఉపయోగపడాలి... వ్యాపారం కోసం కాదు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి... ప్రజలకు, చిన్నారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారా? లేక ఈ ఆరోపణలు కూడా ఇతర అనేక విషయాల్లా మరుగున పడిపోతాయా? అన్నది ప్రజలు వేచి చూస్తున్నారు. ఒక చిన్న టిఫిన్ సెంటర్‌లో జరుగుతున్న ఈ అవకతవకల మొత్తం వ్యవస్థ పర్యవేక్షణ సామర్థ్యంపైనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గోల్కొండ కిరణ్
గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల శివ,మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, సంఘటన స్థలాన్ని పరిశీలన



మంథని/మహాదేవపూర్, అక్షిత ప్రతినిధి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో నిన్న అర్ధరాత్రి చోటుచేసుకున్న ఘోర అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన వడ్రంగి వంగల శేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బిఆర్ఎస్ (టిఆర్ఎస్) మండల ప్రధాన కార్యదర్శి గోల్కొండ కిరణ్, మాజీ సర్పంచ్ నాగుల లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు.

గ్రామంలో అద్దె ఇల్లు తీసుకుని, వడ్రంగి కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వంగల శేఖర్ ఇంట్లో నిన్న అర్ధరాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. బాధితులు తేరుకునేలోపే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంటితో పాటు జీవనాధారమైన వృత్తి పనిముట్లు కూడా పూర్తిగా బూడిదవడంతో శేఖర్ కుటుంబం రోడ్డున పడింది.

విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల శివ ఆధ్వర్యంలో నాయకులు ఈరోజు సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా గోల్కొండ కిరణ్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదంతో సర్వస్వం కోల్పోయిన శేఖర్ కుటుంబానికి ప్రభుత్వం, అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి భారీ నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన ఇంటి యజమానురాలి పేరు మీద ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' మంజూరు చేయాలని కోరారు. మాజీ సర్పంచ్ నాగుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. బాధితుడికి ప్రభుత్వం నుండి తగిన న్యాయం జరిగేలా చూడాలని అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎండిపోయిన పంటలకు పరిశీలన
గ్రామ సర్పంచ్ లలిత చిరంజీవి



నాగర్కర్నూలు, అక్షిత ప్రతినిధి: లింగాల మండల పరిధిలోని చేన్నంపల్లి గ్రామంలో ఎల్ ఈ నో ప్రభావంతో ఎండిపోయిన పంటలకు పరిశీలించి పంట నష్ట వివరాలు రాయడం జరుగుతుందని ఏఈఓ శ్రీనిధి రైతులకు చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత చిరంజీవి వార్డ్ మెంబర్ గోవిందమ్మ పాల్గొనడం జరిగింది.

వైద్యవిద్యార్థికి తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆర్థిక సహాయం



కరీంనగర్ అక్షిత బ్యూరో: నిరుపేద విద్యార్థి వైద్య విద్యాభ్యాసానికి తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం సభ్యులు ఆర్థిక సహాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన కుమారి గుండ అనూశ్రీ, తండ్రి: గుండ శ్రీహరి వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్ లో అర్హత సాధించి, సిద్దిపేట జిల్లాలోని సురభి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో ఎంబీబీఎస్ సీటు సాధించినది. వీరి కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కళాశాల ఫీజు మరియు హాస్టల్ ఫీజు కట్టలేని పరిస్థితిలో ఉండి అమ్మాయి మెడికల్ సీటు చేజారిపోకూడదని, వైద్య విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయాన్ని అందించాలని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చిందం శ్రీనివాస్, సభ్యులను కోరగా వెంటనే స్పందించి సంఘ సభ్యుల సహకారంతో విరాళాలు సేకరించి నిరుపేద విద్యార్థిని గుండ అనూశ్రీ వైద్య విద్యాభ్యాసానికి రూపాయలు 50,016 ల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం అధ్యక్షులు చిందం శ్రీనివాస్, ప్రధాన కారదర్శి వంగ రవీందర్, ఉపాధ్యక్షులు మిట్టపల్లి రాజేంద్ర ప్రసాద్, దూస రాజశేఖర్, కోశాధికారి మంచికట్ల, కార్యనిర్వహక కార్యదర్శి గూడెల్లి లక్ష్మి నర్సయ్య, సంయుక్త కార్యదర్శి గట్టు రమేష్,కార్యాలయ కార్యదర్శి దిడ్డి ప్రదీప్, అలువాల భీమేశ్వర్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘనంగా చిరు జ్ఞాపిక అందజేత



కరీంనగర్ అక్షిత బ్యూరో: కరీంనగర్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి కరీంనగర్ డిసిసి అధికార ప్రతినిధి అనంతుల రమేష్ ఆధ్వర్యంలో నాయకులు, ప్రజాప్రతినిధులు చిరు జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ అర్బన్ డీసీసీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేశం, 23వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి రాజకుమార్, డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేష్, భాస్కర్ నాయక్,సత్తినేని శ్రీకాంత్ డివిజన్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలి



మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి : మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గాన్ని జిల్లాగా ప్రకటించాలని కోరుతూ ఎస్.రమణారెడ్డి, మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్, డిసిసి జిల్లా జనరల్ సెక్రటరీ చిలుకూరు బాలకృష్ణలకు సోమవారం వినతిపత్రం జిల్లా ఉద్యమకారులు సమీర్పించారు. అనేక బియ్యం పరిశ్రమలు, సిమెంట్ ఫ్యాక్టరీలు, సహజ సంపద సహజ వనరులు, అనేక రైస్ మిల్లులు సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించకుండా గత పాలకులు మోసం చేశారన్నారు. జిల్లా కార్యాలయాల ఏర్పాటుకు ఎన్ఎస్పి క్యాంపు కాలనీ ఉన్నదన్నారు. గత పాలకులు ఏకపక్షంగా సూర్యాపేటను జిల్లాగా చేశారన్నారు. ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణలో మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలని వినతిపత్రం సమర్పించారు. జిల్లా వస్తే మెడికల్ కళాశాల ఇంజనీరింగ్ కళాశాల, బీఫార్మసీ, ఎం ఫార్మసీ, డి ఫార్మసీ అనేక కాలేజీలు రావడం జరుగుతున్నదన్న ఆశతో ప్రజలన్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి మిర్యాలగూడ నియోజకవర్గాన్ని జిల్లాగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి కన్వీనర్, ఎఐఎంఐఎం జిల్లా సంయుక్త కార్యదర్శి సయ్యద్ ఫారుక్, బిసి జెఎసి కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజు, జిల్లా సాధన సమితి కన్వీనర్ వైహెచ్ పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లా వజ్జగిరి అంజయ్య, ఉపాధ్యక్షుడు బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబల్లి దుర్గయ్య, ఎస్టి నాయకులు కిషన్ నాయక్ పాల్గొన్నారు.

ఎల్ నినోపై అవగాహన పర్యావరణాన్ని రక్షిద్దాం..



తుంగతుర్తి/మద్దిరాల, అక్షిత ప్రతినిధి : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం మద్దిరాల మండలం గుమ్మడవెల్లి గ్రామంలో సమాచార పౌర సంబంధాల అధికారుల ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో ఎల్ నినో విపత్తుపై ప్రజలకు, రైతులకు కళారూపాల ద్వారా విస్తృత అవగాహన కల్పించారు. ఈ సదస్సులో సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీకాంత్, టీం లీడర్ గంట బిక్షపతి వారు మాట్లాడుతూ . ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పసిఫిక్ మహాసముద్రంలో వేడి గాలులు పెరిగే అవకాశం ఉందని, దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఎండలు, కరువులు లేదా వరదలు సంభవించి వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ముఖ్యంగా వరి, పత్తి, పప్పుధాన్యాలు వంటి వర్షాధారిత పంటలు సాగు చేసే రైతులు భారత వాతావరణ శాఖ తాజా సూచనలను గమనిస్తూ, స్థానిక వ్యవసాయ అధికారుల సలహాల మేరకు సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. నీటి కొరతను అధిగమించేందుకు ముందస్తు జాగ్రత్తలు అవసరమని సూచించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పరిసరాల పరిశుభ్రతతో పాటు గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు గద్దం ఉదయ్, పల్లెల రాము, లక్ష్మణ్, పాక ఉపేందర్, మంజుల, నాగలక్ష్మి, మల్లమ్మ, ప్రవంతి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనున్న ఆలయాలు

నేటి నుంచి పవిత్ర కార్తీక మాసం ప్రారంభం

నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు

ఆధ్యాత్మిక సందడి

శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు దీపారాధనలతో భక్తిపారవశ్యం



కరీంనగర్ అక్షిత బ్యూరో: హర హర మహాదేవ.. శంభో శంకర.. ఓం నమఃశివాయ అంటూ శివనామస్మరణతో పల్లెలు, పట్టణాలు మారుమోగే పవిత్ర కార్తీక మాసం నేటి నుంచి ప్రారంభం కానుంది. హిందూ ధర్మ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన మాసాల్లో కార్తీక మాసానికి విశిష్టమైన స్థానం ఉంది. శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైన ఈ మాసంలో భక్తి, ఆధ్యాత్మికత, నియమనిష్ఠలు, పూజలు, వ్రతాలు, దీపారాధనలతో భక్తజనం ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందనున్నారు.కార్తీక మాసం ప్రారంభమైందంటే చాలు.. తెల్లవారుజామునే నిద్రలేచి పవిత్ర స్నానాలు ఆచరించడం, నుదుట విభూతి ధరించడం, శివాలయాలకు చేరుకుని పరమశివుడిని దర్శించుకోవడం భక్తుల నిత్య కృత్యంగా మారుతుంది. ఆలయాల్లో శివలింగానికి పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వదళార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మారేడు దళాలతో పరమశివుడిని అర్చించడం, ఓం నమఃశివాయ అనే పంచాక్షరీ మంత్రాన్ని జపించడం ద్వారా ఆ పరమేశ్వరుడి అనుగ్రహం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

"దీపారాధనకు ప్రత్యేక ప్రాధాన్యత"

కార్తీక మాసంలో దీపారాధనకు అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. ఇంటి ముంగిట, తులసి కోట వద్ద, ఆలయ ప్రాంగణాల్లో దీపాలు వెలిగించడం ఈ మాసంలోని ప్రత్యేక ఆచారం. మట్టి ప్రమిదల్లో నూనె లేదా నెయ్యితో దీపాలు వెలిగిస్తూ భక్తులు తమ భక్తిప్రపత్తులను చాటుకుంటారు. చీకటిని పారద్రోలి వెలుగును ప్రసరించే దీపం మానవ జీవితంలో అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే ప్రతీకగా భావిస్తారు. ప్రతి దీపం వెనుక ఒక ఆధ్యాత్మిక భావన, ప్రతి జ్యోతి వెనుక ఒక భక్తి సంకల్పం దాగి ఉంటుంది.

"కార్తీక సోమవారాలకు విశేష ప్రాధాన్యత"

ఈ మాసంలో వచ్చే ప్రతి సోమవారం శివారాధనకు అత్యంత పవిత్రమైన రోజుగా భావిస్తారు. కార్తీక సోమవారాల్లో ఉపవాస దీక్షలు చేపట్టి, తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకుని అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. రోజంతా నియమ నిష్ఠలతో ఉంటూ సాయంత్రం వేళ శివాలయాల్లో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తారు. మహిళలు కుటుంబ సౌఖ్యం, ఆయురారోగ్యాలు, సంతాన సౌభాగ్యం కోసం కార్తీక వ్రతాలను ఆచరిస్తారు.

"ఉసిరి, తులసి పూజలు.. వనభోజనాల సందడి"

కార్తీక మాసంలో ఉసిరి చెట్టు పూజ, తులసి ఆరాధనకు కూడా ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు నిర్వహించడం, తులసి కోటను పూజించడం సంప్రదాయంగా వస్తోంది. కార్తీక వనభోజనాలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితుల మధ్య ఆత్మీయతను పెంపొందిస్తాయి. ప్రకృతి ఒడిలో ఉసిరి చెట్టు కింద సామూహికంగా భోజనాలు చేయడం ద్వారా ప్రకృతితో మానవుడికి ఉన్న అనుబంధాన్ని ఈ సంప్రదాయం చాటిచెబుతుంది.

"కార్తీక పౌర్ణమి.. దీపాల పండుగ"

కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమికి ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాశస్త్యం ఉంది. కార్తీక దీపోత్సవాలు, ఆలయాల్లో అఖండ దీపారాధనలు, జ్వాలాతోరణం వంటి సంప్రదాయాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఈ పవిత్ర మాసంలో నదులు, పుష్కరిణుల్లో స్నానాలు ఆచరించడం, అన్నదానాలు చేయడం, పేదలకు వస్త్రదానం చేయడం, పరోపకారం చేయడం పుణ్యప్రదమని పురాణాలు పేర్కొంటున్నాయి.

"భక్తి మార్గంలో నడిపించే పవిత్ర మాసం"

కార్తీక మాసం కేవలం పూజలు, వ్రతాలకే పరిమితం కాకుండా మనిషిలో ఆధ్యాత్మిక చింతన, దైవభక్తి, దానధర్మాలు, సేవాభావం, సత్ప్రవర్తనను పెంపొందించే పవిత్ర కాలంగా నిలుస్తుంది. కోపం, అసూయ, ద్వేషాలను విడిచిపెట్టి సత్యం, ధర్మం, దయ, కరుణ మార్గంలో పయనించాలని ఈ మాసం సందేశమిస్తుంది. భగవంతుడి నామస్మరణతో మనసును ప్రశాంతంగా ఉంచుకుంటూ, కుటుంబ సభ్యులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా కార్తీక మాసాన్ని పవిత్రంగా గడిపేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు.

మొత్తంగా కార్తీక మాసం రాకతో కరీంనగర్ జిల్లాలోని శివాలయాలు భక్తజన సందోహంతో కళకళలాడనున్నాయి. దీపాల వెలుగులు, వేదమంత్రాల ఘోష, శివనామస్మరణ, భక్తుల హరహర మహాదేవ నినాదాలతో నెలరోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరియనుంది.

ఎక్మాయి దర్గా పరిసరాల్లో అక్రమ మైనింగ్ యంత్రాలను వెంటనే సీజ్ చేయాలి

అధికారుల పరిశీలన తర్వాత మళ్లీ తవ్వకాలు.. అక్రమార్కు లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి..

తెలంగాణ రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వహాబ్ డిమాండ్..



తాండూరు అక్షిత ప్రతినిధి: వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామంలోని చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన హజ్రత్ పొడుల్లా హుస్సేనీ దర్గా పరిసరాల్లో కొనసాగుతున్న అక్రమ మైనింగ్ పై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వహాబ్ డిమాండ్ చేశారు. దర్గా సమీపంలోని సర్వే నంబర్ 147లో జరుగుతున్న అక్రమ తవ్వకాలను తక్షణమే నిలిపి వేయడంతో పాటు అక్కడ ఉన్న భారీ యంత్రాలు, వాహనాలు, తవ్వక పరికరాలను సీజ్ చేయాలని, కోరారు. ఈ మేరకు సోమవారం బషీరాబాద్ తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా అబ్దుల్ వహాబ్ మాట్లాడుతూ.. గతంలో సమర్పించిన ఫిర్యాదుపై స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన తహ సీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అయితే అధికారులు పరిశీలన జరిపి వెళ్లిన వెంటనే అక్రమ మైనింగ్ నిర్వాహకులు మళ్లీ తవ్వకాలు ప్రారంభించారని ఆరోపించారు. మైనింగ్ ప్రాంతంలో భారీ యంత్రాలు, వాహనాలు అలాగే ఉండటంతో అధికారుల పర్య వేక్షణకు చిక్కకుండా అక్రమ తవ్వకాలు కొనసాగిస్తున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు.

నాలుగు ప్రధాన డిమాండ్లు..

1. మైనింగ్ యంత్రాల సీజ్: అక్రమ మైనింగ్ ప్రాంతంలో ఉన్న ఎక్స్‌కవేటర్లు, భారీ వాహనాలు, తవ్వక పరికరాలను వెంటనే సీజ్ చేసి రెవెన్యూ లేదా పోలీసుల కస్టడీలోకి తీసుకోవాలి.

2. క్రిమినల్ కేసుల నమోదు: ఎలాంటి అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా మైనింగ్ నిర్వహిస్తున్న వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలి.

3. క్వారీ ప్రాంతానికి సీల్: లీజు గడువు ముగిసినప్పటికీ సర్వే నంబర్ 147లో తవ్వకాలు, ఆక్రమణలు కొన సాగుతున్న నేపథ్యంలో క్వారీ ప్రాంతాన్ని పూర్తిగా సీల్ చేసి అక్రమ ప్రవే శాలను అరికట్టాలి.

4. 200 ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ: దర్గా నిర్మాణానికి ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా దర్గా పరిసరాల్లోని 200 ఎకరాల ప్రభుత్వ భూమికి సమగ్ర సర్వే నిర్వహించి, హద్దులు నిర్ణయించి శాశ్వత రక్షణ కల్పించాలి.

లేకపోతే కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా..

అక్రమ మైనింగ్ ప్రాంతంలోని యంత్రాలను వెంటనే సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు నేరుగా ఫిర్యాదు చేస్తామని, అబ్దుల్ వహాబ్ హెచ్చరించారు. అవసరమైతే కలెక్టరేట్ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సమితి తరఫున స్పష్టం చేశారు.

మానవీయ కోణంలో ప్రజా సమస్యల పరిష్కారం

ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

జిల్లా అధికారులు ప్రతివారం టూర్ డైరీ సమర్పించాలి

కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్ అక్షిత బ్యూరో: ప్రజల సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి, వాటికి సత్వర పరిష్కారం చూపడమే ప్రజావాణి ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. అర్జీల స్వీకరణ, పరిష్కారం, పెండింగ్ వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలకు కచ్చితమైన సమాచారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో వస్తున్న ప్రతి అర్జీకి తప్పనిసరిగా రసీదు అందిస్తున్నామని పేర్కొన్నారు.

"ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష"

ప్రజావాణి కార్యక్రమానంతరం పెండింగ్ దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అత్యధిక దరఖాస్తులు పెండింగ్లో ఉన్న జిల్లా పంచాయతీ, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్, విద్యుత్ శాఖ ఆర్టీసీ ఇరిగేషన్ తదితర శాఖల అధికారులను దరఖాస్తుల స్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణి దరఖాస్తు లపై ఎట్టి పరిస్థితులను నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు.

ప్రతి దరఖాస్తు ను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించి అర్జీదారుకు సమాచారం తెలియ జేయాలని అన్నారు. జిల్లా స్థాయిలో పరిష్కారం చేయలేని అర్జీలు వస్తే దరఖాస్తుదారులకు వివరంగా తెలియజేయాలని పేర్కొన్నారు.సీఎం ప్రజావాణికి సంబంధించిన అన్ని దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని అన్నారు.

ప్రభుత్వ శాఖల వారీగా పెండింగ్ కోర్టు కేసులను పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

"4,880 అర్జీలకు పరిష్కారం"

2026 మే నుంచి అక్టోబర్ వరకు జిల్లా స్థాయిలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 5,943 అర్జీలు స్వీకరించగా, వాటిలో 4,880 అర్జీలను పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. వివిధ కారణాలతో 1,063 అర్జీలు పెండింగ్లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వెలువడుతున్న ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి ముగిసిన వెంటనే డీపీఆర్వో కార్యాలయం నుంచి మీడియా ప్రతినిధులకు ఫొటోలు సత్వరమే అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి నిర్వహణలో పారదర్శకత, అర్జీల పరిష్కారం, మీడియా సమన్వయానికి ప్రాధాన్యం ఇస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

"జిల్లా అధికారులు ప్రతివారం టూర్ డైరీ సమర్పించాలి"

అన్ని శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు ప్రతివారం తమ టు డైరీ జిల్లా రెవెన్యూ అధికారికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రాబోయే వారంలో నిర్వహించ వలసిన పనులపై అడ్వాన్స్ టూర్ ప్రోగ్రాం డైరీ సిద్ధం చేసుకోవాలని, వారం తర్వాత అధికారుల టూర్ డైరీని సమర్పించాలని తెలిపారు. జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహిస్తామని, క్షేత్రస్థాయి సందర్శనలో అధికారులు ప్రజా అవసరాలను సమస్యలను గుర్తించి జిల్లా యంత్రాంగం నిర్వహించి చర్చించాలని తెలిపారు. అంతిమంగా ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా అధికారుల క్షేత్ర సందర్శన ఉండాలని అన్నారు.

"19న ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలి"

ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో నిర్మాణం పూర్తయిన వివో గ్రామపంచాయతీ అంగన్వాడి పాఠశాల తరగతి గదులు వంటి ప్రారంభోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోనూ పనులు పూర్తయిన వివిధ భవనాల ప్రారంభోత్సవాలు ఉంటాయని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రారంభోత్సవాలకు సిద్ధమవుతున్న అన్ని భవనాల జాబితాను సంబంధిత మండల అధికారులకు అందజేయాలనిబ ఆదేశించారు. మండల స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు తమ మండలాలు గ్రామాల్లో ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో సందర్శించి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు.

"ప్రజావాణికి 92 దరఖాస్తులు"

సోమవారం ఐ డి ఓ సి లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 92 దరఖాస్తులు వచ్చా యి. అత్యధికంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు 19, గృహ నిర్మాణ సంస్థకు 16, కరీంనగర్ ఆర్డిఓ కార్యాలయానికి 12 దరఖాస్తులు వచ్చాయి.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి డిఆర్ఓ స్వామి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు!

నిర్ణీత గడువులోగా ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి

పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి..

కలెక్టర్ భవేష్ మిశ్రా...



నిర్మల్, అక్షిత ప్రతినిధి, నవంబర్ 9: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, అధికారులను స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వివిధ అర్జీలను స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి, భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన వినతులను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజావాణి లాగిన్లో నమోదైన ప్రతి దరఖాస్తుకు నిబంధనల ప్రకారం సముచిత సమాధానం అందించాలని, పెండింగ్లో ఉన్న అర్జీలను ప్రత్యేకంగా గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, నిర్దేశిత గడువులోగా చర్యలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

అటల్ పెన్షన్ యోజన అమలులో నిర్మల్‌కు ఎక్సలెన్స్ అవార్డు!

95 శాతం నమోదు లక్ష్యంతో రాష్ట్రస్థాయిలో గుర్తింపు 56,145 మందికి పథకం ప్రయోజనాలు.. బ్యాంకు అధికారులను అభినందించిన కలెక్టర్

అటల్ పెన్షన్ యోజన అమలులో నిర్మల్ జిల్లా విశేష ప్రతిభ కనబరిచి ఎక్సలెన్స్ అవార్డును సొంతం చేసుకుంది. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 95 శాతం నమోదు లక్ష్యాన్ని సాధించి జిల్లాకు ఈ గుర్తింపు లభించింది. జిల్లాలో మొత్తం 56,145 మంది ఈ పథకంలో చేరగా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు కీలక పాత్ర పోషించారు.

ఈ నెల 6న హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పీఎఫ్ఆర్డీఏ సీజీఎం ఆశుతోష్ కుమార్ చేతుల మీదుగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్ అవార్డును అందుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఈ అవార్డును జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఎల్‌డీఎం రాంగోపాల్‌ను అభినందించారు. జిల్లాకు ఈ గుర్తింపు తీసుకురావడంలో కృషి చేసిన బ్యాంకు అధికారులు, సిబ్బందిని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవరావు, రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

దివ్యాంగుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్. అశోక్



రామన్నపేట,అక్షిత ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి పాల్గొనే సభలు జరిగిన ప్రతీసారి దివ్యాంగులను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం రాజ్యాంగ హక్కులకు విరుద్ధమని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్. అశోక్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న దివ్యాంగులను అరెస్టు చేయడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ముఖ్యంగా దివ్యాంగుల పింఛన్ పెంపు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం--2016ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తున్న దివ్యాంగులపై అక్రమ అరెస్టులకు పాల్పడటం సరైన విధానం కాదన్నారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిని చిన్నచూపు చూస్తూ అణచివేత ధోరణి అవలంబించడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో దివ్యాంగులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో దివ్యాంగులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి, వారి హక్కుల సాధన కోసం పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని డాక్టర్ అశోక్ హెచ్చరించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేకు దివాళి పండగ శుభాకాంక్షలు తెలియజేసిన టిపిసిసి మాజీ కార్యదర్శి సయ్యద్ రజాలి



కాజీపేట్, అక్షిత ప్రతినిధి: హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో నాయిని రాజేందర్ రెడ్డికి సోమవారం నాడు టి పి సి సి మాజీ కార్యదర్శి సయ్యద్ రజాలి దివాళి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా సయ్యద్ రజాలి మాట్లాడుతూ ఈ పర్వదినం ప్రజల జీవితాల్లో నూతన ఆశలు, సరికొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని కోరుకున్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ మరింత ప్రగతిపథంలో పయనించాలని ఆకాంక్షించారు

రజాలి పాటు మాజీ వరంగల్ డిప్యూటీ మేయర్ పెద్దలు అశోకరావు , హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ అంకుష్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి "దళిత రత్న" పసునూరి మనోహర్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న ,మాజీ కార్పొరేటర్ అబు బకర్ ,కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్,నాయిని లక్ష్మారెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు.

పంజాల ఐలయ్యకు గౌరవ డాక్టరేట్



ఖమ్మం/అక్షిత బ్యూరో : ప్రముఖ రచయిత కవి జర్నలిస్ట్ విశ్రాంత ఉపాధ్యాయుడు పంజాల ఐలయ్య కు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆదివారం గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్ ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటుచేసిన వెబ్బిక్ యూనివ ర్సిటీ కాన్వకేషన్ లో ఆయనకు ఈ డాక్టరేట్ ప్రదానం చేశారు. విజ్ఞాన విద్య,సా మాజిక అభివృద్ధిలో గత 35 ఏళ్లుగా ఆయన చేసిన విశేష సేవలను వెబ్బిక్ యూనివర్సిటీ గుర్తించింది.తరగతి గది బోధనకే పరిమితం కాకుండా సామాజిక విద్య, పర్యావరణం పరిర క్షణ కార్యక్రమాల్లో ఐలయ్య చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హర్యానా హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచార్యులు రామకృష్ణ ఉప్పల శ్రీనివాస్ గుప్తా చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ను అందించారు. పంజాల ఐలయ్యకు గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల పలువురు ఉపాధ్యాయులు కవులు కళాకారులు ఐలయ్యను అభినందించారు.

ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్ భవేష్ మిశ్రా...

యంత్రాల భద్రత, నిల్వ ఏర్పాట్ల పరిశీలన..
రికార్డుల తనిఖీ



నిర్మల్,అక్షిత ప్రతినిధి నవంబర్ 9 : నిర్మల్ జిల్లా ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల భద్రతపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల భద్రపరిచే గోదాను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన యంత్రాల భద్రత, నిల్వ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. యంత్రాల భద్రతకు సంబంధించి నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేసి, నిల్వ వివరాలను పరిశీలించారు.

ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ వెంకట మాధవరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షణ అధికారి స్వాతి, తహసీల్దార్ రాజు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

జాతీయస్థాయి విలువిద్య పోటీలకు "అల్ఫోర్స్" విద్యార్థిని ఎంపిక



కరీంనగర్ అక్షిత బ్యూరో: హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్లో నిర్వహించబడిన ఎస్ జి ఎఫ్ ఐ అండర్ 19 విభాగంలో 03.11.2026 నుండి 05.11.2026) విలువిద్య పోటీలలో "అల్ఫోర్స్" విద్యార్థిని కూన వందన రెండవ స్థానంలో నిలిచినది. అంతే కాకుండ డిసెంబర్ మాసంలో మహారాష్ట్రలోని అమరావతిలో నిర్వహించబడే జాతీయస్థాయి విలువిద్య పోటీలకు కూడ ఎంపిక కావడం జరిగింది. బాల్యం నుండి విలువిద్య పై పట్టు సాదించిన కుమారి వందన తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జాతీయస్థాయి పోటీలలో స్థానం సంపాదించుకోగలిగింది. ఎస్ జి ఎఫ్ ఐ లో రెండవ స్థానం సాదించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన మా విద్యార్థినిని నేను మన:స్ఫూర్తిగా అభినందిస్తున్నాను. జాతీయస్థాయి పోటీలలో కూడ రాణిస్తుందని నేను విశ్వసిస్తున్నాను అని నరేందర్ రెడ్డి అన్నారు



మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతూ..

మహిళలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, అల్మాస్ గూడలో క్రైస్తవ మహిళలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన ఇంటర్ డినామినేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్ , పెద్దపల్లి జిల్లా

రామగుండం, అక్షితన్యూస్: హైదరాబాద్‌లో క్రైస్తవ మహిళలపై జరిగిన దాడి ఘటనను ఇంటర్ డినామినేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్ పెద్దపల్లి జిల్లా తీవ్రంగా ఖండించింది. రామగుండం హౌసింగ్ బోర్డులోని సీయోను ప్రార్థన మందిరంలో జరిగిన పాస్టర్ల సమావేశంలో ఈ ఘటనపై స్పందించారు. మహిళలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఐపీఎఫ్ నాయకులు మాట్లాడుతూ, దాడికి గురైన క్రైస్తవ మహిళలకు తమ సంఘం అండగా ఉంటుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ మద్దతు కొనసాగిస్తామని తెలిపారు. మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతూ, మహిళలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను, ప్రతి ఒక్కరి వ్యక్తిగత గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, పోలీసు యంత్రాంగానికి ఉందని పేర్కొన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడితే చట్టపరంగా ఫిర్యాదు చేయాలి తప్ప, చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడులకు పాల్పడటం సరైన విధానం కాదని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఐపీఎఫ్ అధ్యక్షులు ఎం. మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు కె. దాస్, ప్రధాన కార్యదర్శి పి. డిలైట్ నతనియేల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి జె. ప్రహర్షి, కోశాధికారి ఈ. థామస్ బాబు, కార్యనిర్వాహక సభ్యులు ఎ. రవి వర్మ, పి. ప్రసన్న కుమార్, ఎన్. ఎఫ్రాయిమ్, సీనియర్ దైవజనులు బి. రవి పాల్, ఎం.కె ఆనంద్ బాబు, జి. జాన్ తదితర ఐపీఎఫ్ దైవజనులు పాల్గొని ఈ ఘటనను ఖండించారు.

దీపావళి సందర్భంగా పేకాటపై పోలీసుల ఉక్కుపాదం....!

125 కేసులు.. 649 మంది పట్టుబాటు..
రూ.13.07 లక్షలు స్వాధీనం...
ఆర్మూర్ డివిజన్‌లో 26 కేసులు నమోదు.. 131 మంది అరెస్ట్...



నిజామాబాద్, అక్షిత బ్యూరో: దీపావళి పండుగ సందర్భంగా పేకాట స్థావరాలపై నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విస్తృతంగా దాడులు నిర్వహించారు. నవంబర్ 7 నుంచి నవంబర్ 9వ తేదీ ఉదయం 11 గంటల వరకు కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో పేకాట ఆడుతున్న వారిపై మొత్తం 125 కేసులు నమోదు చేసి, 649 మందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.13,07,380 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ వెల్లడించారు.

డివిజన్ల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి:

నిజామాబాద్ డివిజన్,29 కేసులు, 175 మంది పట్టుబడగా రూ.5,25,370 స్వాధీనం.

ఆర్మూర్ డివిజన్, 26 కేసులు, 131 మంది పట్టుబడగా రూ.2,20,760 స్వాధీనం.

బోధన్ డివిజన్: 70 కేసులు, 343 మంది పట్టుబడగా రూ.5,61,250 స్వాధీనం.

దీపావళి పండుగ సమయంలో పేకాట కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా, ప్రత్యేక బృందాలు, నియంత్రణ గదిని ఏర్పాటు చేసి చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.

పండుగల పేరుతో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనే సంకేతాలను పోలీసుల ఈ చర్యలు స్పష్టం చేస్తున్నాయి.

న్యాయం చేయండి సారు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన జేఏసీ నాయకులు





వరంగల్, అక్షిత బ్యూరో: తమకు న్యాయం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నీ హనుమకొండ లోని పార్టీ కార్యాలయం లో ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యల పై జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వంతో చర్చలు జరిపి ఉద్యోగులకు న్యాయం చేయాలని వినతిపత్రం ఇచ్చారు. ఇట్టి కార్యక్రమంలో పల్లె దవఖాన డాక్టర్ హరికృష్ణ , డాక్టర్ జైపాల్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ మేనేజర్ వైకుంఠం, ఏ.ఎన్.ఎం.లు దాసరి నర్మదా, బానోతు రజిత, సంధ్య, జ్యోతి , గీత ,టీబీ డిపార్ట్మెంట్ రంజిత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం వరంగల్ నగరంలోని పోచం మైదాన్ సర్కిల్ లో ఎన్ హెచ్ ఎం జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న యధావిధిగా కొనసాగుతున్న నిరవధిక సమ్మెకు సోమవారం నాటికి 28 వ రోజు చేరుకుంది. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరినీ రెగ్యులరైజేషన్ చేయాలని, అప్పటివరకు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరికీ 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డ్స్, హెల్త్ ఇన్సూరెన్స్ తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా , డాక్టర్.వి.మోహన్ రావు, డాక్టర్.హరిక , డాక్టర్ నిఖిల్ , ఈవిన్ మేనేజర్ రవీందర్, డి.పి.ఓ అర్చన, డైకు మేనేజర్ మేర్గు అనిల్ కుమార్ , ఎం.జీ ఎం డైకు సెంటర్ నుండి పవన్ కుమార్ , అమూల్య, మాధవి, వనజ, నర్సింగ్ ఆఫీసర్స్ మేకల మంజుల, సుమలత, కళ్యాణి, సుమలత, ఫార్మసీ ఆఫీసర్ నూకల అంజి యాదవ్, పబ్లిక్ హెల్త్ మేనేజర్ జన్ను కోర్నెల్, అకౌంటెంట్స్ కే.శ్వేత, తోటి ఉద్యోగులు పాల్గొన్నారు...